# కళాజీవి కన్నీళ్లు

[ చిన్న కథ ]

'దెబ్బ తిన్న హృదయానికి కన్నీళ్ళు అమృతోదకం అంటారు కదా! పోనీ హాయిగా హృదయం తేలిక అయ్యేట్లు కడుపునిండేక నీళ్ళయినా కార్తామంటే అవీ సమయానికి రావు.'

రచయిత.
బూర్గుల రంగనాథరావు

౧

పరుగెత్తుతున్నాయి పగళ్ళూ రాత్రులూ. ఒకటి తర్వాత ఒకటి! వారాలు, నెలలు సంవత్సరాలు! నిరర్థకంగా వెళ్ళి పోతున్నది కాలం. అమూల్యమైన జీవితపు గడియలు నిష్ఫలంగా కొట్టుక పోతున్నాయి- ఎటన్నిటీ లోకి. ఏం చేస్తున్నట్టు? ప్రపంచంలోకి వచ్చియేమి సాధించుకొన్నట్టు? ఏం ఆనందం అనుభవించాను? ఏం ఆనందం యితరులకు యివ్వగలిగాను? ఈరోజు లిట్లా పోతూ వుంటే ముసలితనం, మృత్యువు నన్ను దగ్గరికి లాక్కుంటూవుంది. ఏమీ తోచదు. అంతా వ్యర్థం, బద్ధకం, అశాంతి, అతృప్తి... పోనీ హాయిగా హృదయం తేలిక అయ్యేట్లు కడుపునిండా కన్నీళ్ళయినా కారుస్తామంటే అవీ సమయానికి రావు... దెబ్బతిన్న హృదయానికి కన్నీళ్లు అమృతోదకం అంటారు కదా...'

ఇట్లా విలపిస్తున్నాడు శ్రీధరశాస్త్రి.

అతనికే తెలియదు అతని హృదయం యెందుకింత అసంతృప్తి, ఆవేదనతో బాధపడుతున్నదో.

దాని నైజగుణమా?...

అందరు కళాజీవులకి మల్లేనే అతనూ తన వ్యక్తిత్వాన్ని మామూలు ప్రపంచాన్ని అధిగమించిన భావనావీధుల్లో ప్రతిష్ఠించుకోజూస్తాడు.

యీ దారిద్ర్యంలో పడి, దానితో తృప్తి జెంది రోమాన్సును పోగొట్టుకుంటాడా మామూలు మనిషివలె?

ప్రొద్దున్నే హాయిగా దిక్కులను చప్పరిస్తూ వచ్చే యెండపొలపులూ, వెచ్చని మధ్యాహ్నాలు, మధురమైన వెన్నెలరాత్రులూ, గంభీరమైన నిశీధాలు గడిచిపోతూంటే, 'అయ్యో వ్యర్థమవుతున్నాయే' అని గుండె కొట్టుకుంటాడు. వెలుపల వర్షం కురుస్తుంటే చల్లని ఆహానవాసన గాలి పీలుస్తూ, యేమో కొత్త ఉత్సాహంతో గడచిపోతున్న గడియలకు దిగులుపడతాడు. వీటి అన్నింటివలన కలిగే కమ్మని బాధకు కారణమేమి?

కళాజీవి కావడమే కారణమా? లేక దారిద్ర్యమా?...

ఈవిధమైన గోలలో రెండులో తల కూర్చి పక్కమీద ఆరాటపడుతున్న శ్రీధర్ గదికి అతని భార్యవచ్చి, అలా పడుకున్నందుకు కారణంగూడా అడగకండా బీరువాలోనుంచి గోదోజాకెట్టు తీసుకుని వెళ్ళిపోయింది. ఆమె యీ దారుణమైన అశ్రద్ధను చూసి అతను మరీ నొచ్చుకున్నాడు. ఈ అశ్రద్ధ ఆనాటిదే కాదు. వారి వివాహమైనప్పటినుంచీ వున్నది.

తన అర్ధాంగి, సహభాగిని అయిన ఆమె, తన బాధల్ని తన అనుమానాలనీ, తనపగటి కలల కలతనూ యెందుకు పంచుకోదు? పంచుకునే యిష్టంలేకపోతే మానే, అసలు వాటిని అర్థంచేసుకునే ప్రయత్నమేనా, ఎందుకు చేయదు? ఇది మరీ ఘోరమైన విషయం!

తన తలిదండ్రులు, చివరికి ఎం. ఏ. పాసైన తన అన్నగూడా తనబాధల్ని తెలిసికో ప్రయత్నించరు.

డబ్బుగూడా పుష్కలంగా లేదు- యిష్టంవచ్చినట్టు వెదజల్లి ఆనందం, తృప్తి కొనుక్కోడానికి.

ఇలాంటి దుర్భరమైన కుటుంబ పరి

స్థితుల్లోనుంచి తప్పించుకుని యే అల్మోరాకో, అడయార్‌లాంటి కళాక్షేత్రానికో వెళ్ళ నిశ్చయించాడు శ్రీధర్.

ఈ రెండుచోట్లకూ వెళ్ళ సాధ్యం కాకపోతే, సుస్థాపితమైన యే ఫిల్ము కంపెనీలోనైనా చేరదలచాడు.

ఏదో అవ్యక్తమైన ఆదర్శాన్ని అందుకునేటందుకు అతని ఆత్మ యెగిరిపడుతూంది. అత్యున్నతమైన కళాశృంగాల్ని యెక్కాలని అతని హృదయం ఉయ్యాలలూగుతూంది. ఎంత యోచించినా అతనికి దారి కనబడలేదు.

౨

ఆ రాత్రి యింట్లో భోజనంచేయక, హోటల్లో అరకప్పు కాఫీమాత్రం తాగి ఒక్కడే ఓ నిర్జనమైన మైదానంలోకి వెళ్ళి కూర్చున్నాడు.

వెన్నెల ప్రశాంతంగా వుంది. దూరపు కొండలచుట్టూ మంచు పొగలు పాముల్లాగు చుట్టుకుంటున్నాయి. చలిగాలి వియుక్తాత్మవలె కొబ్బరిచెట్ల కొమ్మలతో ఆడుకుంటున్నది. తన కాంతిని తానే దిగ్భ్రమ జెందినట్లు చంద్రుడు వెట్టి లోకాన్ని ఆశ్చర్యంతో చూస్తున్నాడు.

శ్రీధరుని యోచనాపరంపర ఆగలేదు. మెత్తగా పచ్చికమీద పడుకున్నాడు. కొంచెందూరంలో యేదో అలికిడి వినవచ్చింది. మళ్ళీ అదేచప్పుడు; ఇంకా స్పష్టంగా వినపిస్తున్నది. ఓ స్త్రీకంఠం యేడుస్తూన్నట్టుంది. తాత్కాలికంగా తనబాధను మరచి, అతను ఆమె వైపు వెళ్లాడు. ఆమెను పోల్చుకుని ఆశ్చర్యచకితుడయి 'మీరా!' అని పలకరించాడు.

ఆమె మాట్లాడలేదు.

## తేలుమందు

నల్లగుడ్డను బాగుగా కాల్చి దానిని బెల్లముతో చేర్చి బాగుగా నూరి వొకకాసీ (1 పైసా-కాలణా-కొత్తడబ్బు) వెడల్పుగా బిళ్ళలుచేసి వుంచుకొనవలెను. తేలు కుట్టినవెంటనే ఒకబిళ్ళను తీసి కుట్టినచోట పెట్టినొక్కినచో అది బిగుసుకొనిపోవును. తరువాత క్రమముగా బిళ్ళ కరుగుచుండును. విషము తగ్గుచున్నదనుటకిది గురుతు. బిళ్ళపూర్తిగా కరుగుసరికి బాధ పూర్తిగా తగ్గును.

---

'ఎందుకు యేడుస్తున్నారు? యిట్లా వచ్చారేం?' అన్నాడు.

'ఏమీలేదు' అని కళ్లుతుడుచుకుంటూ విచారం దిగమింగ ప్రయత్నిస్తూ ఆమె సమాధానం చెప్పింది.

అనసూయను శ్రీధర్ చిన్నప్పటినుంచీ యెరుగును. ఆమె కిప్పుడు పాతికేళ్లుంటాయి. భర్తపోయి నాలుగేళ్ళయింది. ఆమెతండ్రి యీకాలపువాడవుటచే ఆమెకు పునర్వివాహం చేయ నిశ్చయించి కృష్ణశర్మ అనే ఒక యువకుడిని ఒప్పించాడు కూడాను. కృష్ణశర్మను మళ్ళీ పెళ్లిచేసుకోవాలని అనసూయకు కూడా వుంది. ఈసంగతి శ్రీధరుకు కూడా తెలుసు...

కాని ఆమె దురదృష్టంవల్ల కృష్ణశర్మ ఓ కమ్యూనిస్టు కుట్రకేసులో నిందితుడయ్యాడు. ఈ సంగతికూడా శ్రీధరుకు తెలుసు. కాబట్టి, ఆమె దుఃఖానికి అతడేమైనా కారణమేమో అనుకుని, 'శ్రీకృష్ణమూర్తి గారి కేసు యేమయింది' అని అడిగాడు.

'నాలుగేండ్లు. కఠినశిక్ష .. ఈ రోజే పేపర్లోవచ్చింది.'

కొంచంసేపు యిద్దరూ నిశ్శబ్దం! ఆమె, తనను తాను ఓదార్చుకుంటున్నట్టు గ్రహించి, 'ఈనాలుగేళ్లూ యేదైనా ఉద్యోగంచేయకూడదా మీరు?' అన్నాడు శ్రీధర్.

'ఉద్యోగం నాకెవరిస్తారు' అంది అనసూయ కొంచెం ఆశ్చర్యం కనబరుస్తూ.

'సినీమాలో... అంటే మీరేమీ అనుకోకండి...సంసార స్త్రీలు...'

'—అందుకొక్కాదు. కాని నన్నెవరు తీసుకుంటారు?' అని తేలికనవ్వుతో మళ్లీ ప్రశ్న.

అనసూయ చాలా అల్లరిపడ్డది భర్తపోయినప్పటినుంచి. నిజంగాకూడా ఆమెకు తన జీవితంపై అసహ్యం కలిగింది. తను నిగ్రహంలేక గూఢంగా చేస్తున్న 'పాపాల'కు ఆమెకే రోతకలిగింది. కాని కృష్ణశర్మ తనకొక గౌరవం, భార్యాత్వంయిచ్చి తన కోరికల్ని పూర్తిచేయడానికి ఒప్పుకున్నందుకు చాలా సంతోషించింది.

కాని యిహ నాలుగురోజులకు పెళ్లి అవుతుందనగా అతడు అరెస్టు కావడం, అతనికి నాలుగేళ్ళ శిక్ష విధింపబడడం, ఆమెకు చాలా బాధకలిగించాయి.

అందుచేతే ఆమెకూడా ఆరోజు యేమీ పాలుపోక అక్కడికి వచ్చి కూచుని యేడుస్తూవుండింది.

కాని శ్రీధరుడు ఆడిన మాటలను వినేటప్పటికి ఆమెకు కొత్త ఆశలూ, కొత్త కోర్కెలూ విజృంభించాయి. ఈ నాలుగేళ్లూ సినిమాలో చేరిపోవాలనుకుంది. తరువాత ఏలాగైతే కృష్ణశర్మను

వివాహం చేసికోవచ్చు. ఇదీ ఆమె సంకల్పం.

అనసూయను తనతో పట్టణం తీసికెళ్ళి ఆమెద్వారా తామూ ఒక ఫిలిం కంపెనీలో చేరదలచాడు శ్రీధర్ అంతే:

తనమూలంగా కాని, తను చేరిన కంపెనీమూలంగా కానీ ఆమె యిష్టానికి యేమీ వ్యతిరేకంగా అనాచారాలు జరుగకండా ఆమెను తనకూతురుగా కాపాడాలనే ఆదర్శంగట్టిగా పెట్టుకున్నాడు శ్రీధర్. ఈనాలుగేళ్లు బాగా డబ్బుగడించి కృష్ణశర్మ వచ్చాక అతిణ్ణి పెళ్లాడి ఆమె ఒక యింటిది కావడానికి బాగా వీలవుతుందని శ్రీధర్ చిత్తంలో తలపోశాడు.

తన ఉన్నతాదర్శం నెరవేరేకొఱకు, కళకోసం ఆమెను ఒక సాధనంగా తీసుకోడంలో శ్రీధరుడికి నీచత యేమీ కనుపించలేదు.

'అంటే చూడండీ! మీకూ మనోవ్యాకులత కాస్తా తగ్గుతుంది. ఆ నాలుగేళ్లు కొంచం సులువుగానే గడుస్తాయి. మన యిద్దరం ఒకేయింట్లో వుండవచ్చును. నేనూ వెళ్తాను చిత్రరంగంలోకి' అని తన మానసిక పరిస్థితిని, తన అశక్తతను, ఉన్నతాదర్శాలను, కళోద్ధరణాభిలాషనూ, అన్నీ ఆమెకు నచ్చచెప్పాడు చివరకి. 'అన్నిటికన్నా ముఖ్యంగా మనం ఈ ముసలాళ్ళ సహవాసంనుండి విముక్తినందుతాము. నిర్లిప్తులై వున్న బంధువులకు దూరంగావుంటాము. పైగా స్వతంత్రంగా జీవిస్తాము. అప్పుడే మన సహజశక్తులు సంపూర్ణవికాసం పొందుతాయి' అన్నాడు.

శ్రీధరుడి అభిప్రాయాలు, అతని చిత్తవృత్తి తెలుసుకున్నాక అతనిమీదజాలి, ఒకవిధమైన గౌరవభావం యేర్పడ్డాయి అనసూయకు.

'అయితే రేపే తెల్లారకట్ల మేల్లో వెళ్ళిపోదామా?' అన్నాడు.

'సరే. కాని మీదగ్గర సరిపోయేంత డబ్బుందా?' అంది ఆమె.

'ముప్ఫయిరూపాయలున్నాయి' శ్రీధర్ అన్నాడు.

'నేనోహ నూరు రూపాయలు తేగలను... స్టేషనువద్ద కలుసుకుందాము.'

'తప్పకుండా రండేం?' అంటూ శ్రీధర్ మరోక్షణం ఆగకండా వెళ్తూంటే, 'నేనూ వస్తున్నాను. ఆములుపుదాకకలిసి వెళ్లొచ్చు' అని ఆమే అతనితో వెళ్లింది.

## 3

రాయపేటలో ఓయిల్లు అద్దెకు తీసుకుని వున్నారు శ్రీధరూ, అనసూయా.

ఇద్దరూ తమతమ భావికార్యక్రమాల్ని తెలుపుతూ తమతమ యిళ్లకు ఉత్తరాలు వ్రాశారు.

శ్రీధరు భార్య తననూ తీసికెళ్లమని ప్రార్థిస్తూ జవాబువ్రాసింది.

అనసూయతండ్రి, మొదలు కొంచెం కోపపడ్డాడు. కాని తనకూతురు యింత ధైర్యంగా తన భావిజీవితాన్ని తానే నిర్ణయించుకుని, కృష్ణశర్మజేల్లోనుంచి వచ్చేదాకా నిరీక్షిస్తుందనుకుని యేమీ చర్య తీసుకోకండా వూరుకున్నాడు.

ఆరు మాసాలు గడచిపోయాయి. అనసూయ, దినదినం తారాపథానికి యెగుకుతూ చిత్రాంబరవీధిలోని సూర్యచంద్రుల్లాంటి నిర్మాతలతోనూ, దర్శకులతోనూ చనువుగావుంటూ ఆ చనువుతో తనను తాను లోకువచేసుకుంది. తనను కాంక్షించినవాడికల్లా లొంగిపోయింది. తన ఆరోగ్యం స్త్రీత్వం గౌరవం పూర్తిగా పాడుచేసుకుంది.

అనుక్షణం ఆమె లోపాలు బాగా స్పష్టమాతున్నకొద్దీ ఆమెలోని ఆకర్షణమీద, సుగుణాలమీది గౌరవం తక్కువాతోంది శ్రీధరుడికి.

ఆమె, యెంతో మంది చేతుల్లో తన యవ్వనపుష్పాన్ని పిప్పి పిప్పి చేయించుకుంది...

ఆమె యింక శ్రీధర్ చేతుల్లో లేదని తెలిసికొని ఆమె అవసరంవున్నా అందరూ అతన్ని నిర్లక్ష్యంచేయసాగారు. శ్రీధరు యేమైనా అంటే సినిమా కంపెనీలో అతనికి వున్న చిన్న ఉద్యోగం కాస్తా వూడేలాగుంది. అతను అనుకున్నట్లు అతనికి గొప్పగొప్ప కళాజీవులతో- స్నేహం అటుండగా- వాళ్లెవరూ అతనివంక చూడనైనా చూడరు. నటులతోగాని, కవులతోగాని, యితర కళాభాయీ లెవరితో కాని అతనికి పరిచయం కలుగలేదు. తనలాంటి మూడోరకపు కథకుడితో ఒకడితో తప్ప స్త్రీలతో అసలే పరిచయంలేదు. ఆ ఫిల్ముకంపెనీలోని అరవగుమాస్తా కన్నా తనను అధ్వాన్నంగా చూస్తున్నారు అందరూ. అనసూయ అసలు శ్రీధరుకు కనపడడమే కష్టమైపోయింది. ఆమె నడవడిని రెండుమూడుమార్లు మందలిస్తే ఆమె బాగా నాల్గుఛీత్కారాలు పెట్టింది.

చివరకి ఓనాడు పొద్దున్న. శ్రీధర్ వార్తాపత్రిక చదువుతూ కూర్చుంటే, అతనికి అరోజున ఆమె స్వయంగా కాఫీ తెచ్చియిచ్చి, తానొక కప్పు తీసుకుంటూ, అతని పక్కనే కూర్చుని, కొంచెం రుద్ధకంఠంలో యిలా ప్రారంభించింది,

'నేను. యస్. వి. రావు — అంటే మన సహాయదక్షకులతో వారి యింటికి వెళ్లిపోతాను. అయినా, నేనూ వివాహం చేసుకుంటున్నాము. ఇప్పుడు వారొచ్చి నన్ను తీసుకెడతారు.'

'అయితే కృష్ణశర్మ...'

'ఇహ కృష్ణశర్మను...అతనికీ నాకూ యేమీ సంబంధంలేదు'

'నామాట ఒకటి వినండి. మీరు...'

'ఇది నా కడపటి నిశ్చయం. మీరేమి చెప్పినా వినేదిలేదు ... క్షమించండి...మీకు నాకృతజ్ఞత. మీవల్లనే నేను యింత ఉన్నతస్థానానికి వచ్చిన మాట వాస్తవం; ఆసంగతి మరవను. మీకు నేను యేమీ సహాయంచేయలేక పోయాను, కాని రావుగారు స్వంతంగా ఓపిక్చరు త్వరలో డైరెక్టు చేయనున్నారు. అప్పుడు...'

'మీ కృతజ్ఞత నాకేమీవద్దు.'

'ఈరూపాయలు మీవద్ద ఉంచండి. మీకు యింకా అవసరమైనప్పుడల్లా నా యథాశక్తి సహాయంచేస్తాను' అని వంద రూపాయిల నోట్లు రెండు బల్లమీద వుంచింది.

శ్రీధర్ తీసికోలేదు.

ఆమె బ్రతిమాలుతోంది తీసికోమని.

ఇంతలో రావు వచ్చాడు.

వెంటనే తన సామాను సద్దుకొని, శ్రీధరుకు గుడ్‌బై కొట్టి ఆమె వెళ్ళిపోయింది.

ఎంతో ఉన్నతాదర్శం పెట్టుకుని తనవెంటవచ్చి అనసూయ యిలా మారిపోవడం, కృష్ణశర్మను వివాహం చేసుకుని బాగుపడబోయే అనసూయ తనవల్లనే కృష్ణశర్మను మరచిపోవడం, మళ్ళీ చూస్తే తనస్థితి యెప్పటివలెనే వుండడం శ్రీధరు హృదయానికి మెరుపుదెబ్బ తగిలినట్లు ఐంది.

అతని ఆశలన్నీ భస్మమయ్యాయి. ఆవేళే అతడు తనవూరికి ప్రయాణం కట్టాడు.

తను కంటూవుండిన కలలుగూడా యీవిధంగా పరిణమించడం, కళాజీవిని అవుదామనుకున్న తన పొరపాటు. ఓ సామాన్య స్త్రీ- అనసూయ- గౌరవంగా గడుపబోయే జీవితాన్ని వదిలిపెట్టి నైతిక పతనాన్ని పొంది తనమూలంగా గొప్ప ఆర్టిస్టు కావడం...అంతా అతనికి ఒక విచిత్రానుభూతిగా అయింది.

పిచ్చి కలలు కన్నందుకు తనుతాను నిందించుకుంటూ శ్రీధర్ మేలులో కూచున్నాడు.


స్త్రీలకు శిరోజములే అందము

జేమ్సు



కోకోనట్ ఆయిల్

శిరస్సునకు హానిచేయు సెంటు, ఆల్కహాలుతో చేరిన హేరాయిలు వాడుటకంటె నిజముగా శుభ్రపరచిన కొబ్బరినూనె వాడిన మెదడును ప్రశాంతముగానుంచి శిరోజములను పెంచును.

మా జేమ్సు కోకోనట్ ఆయిలు అసలు కొబ్బరినూనెలోని మలినపదార్థములనుతీసి నవీనపద్ధతులతో శుభ్రము చేయబడినది.

ఇందులో - మల్లి - గులాబి, వగైరా సువాసనలు దొరుకును.




జేమ్సు ఫర్‌ఫ్యూమరీ కంపెనీ, మద్రాసు.